క్లుప్తంగా

కపిలేశ్వరపురంలో నేడు గడప గడపకూ..

కపిలేశ్వరపురం: సోమవారం మధ్యాహ్నం రెండు గంటలకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు కపిలేశ్వరపురంలో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహిస్తారు. స్థానిక బస్ స్టాండ్ సెంటర్‌లోని వైఎస్సార్ విగ్రహం వద్ద నివాళి అర్పించిన అనంతరం ఇంటింటి పర్యటన సాగుతుందని ఎంపీపీ మేడిశెట్టి సత్యవేణి, వైఎస్సార్‌సీపీ గ్రామ కమిటీ అధ్యక్ష, కార్యదర్శిలు కట్టా మురళి, పీతల బంగారం తెలిపారు.

నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం'

రామచంద్రపురం రూరల్: రామచంద్రపురం ఆర్టీసీ డిపో పరిధిలోని ప్రయాణికులకు అందుతున్న సేవలు, సూచనలు, సలహాల కోసం నేటి ఉదయం 11 నుంచి 12 గంటల వరకు డయల్ యువర్ ఆర్టీసీ ఆర్ఎం కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు ఆదివారం విలేకరులకు తెలిపారు. ప్రయాణికులు ఆ సమయంలో ఫోన్ నంబర్ 99592 25576 పై జిల్లా ఆర్టీసీ ఆర్ఎం ఆర్‌వీఎస్ నాగేశ్వరరావుతో మాట్లాడవచ్చని తెలిపారు.

మండపేట పట్టణ సీఐగా షేక్ అఖిల్ జమ


ఎమ్మెల్సీ తోటతో సీఐ షేక్ అఖిల్ జమ

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట టౌన్ నూతన సీఐగా షేక్ అఖిల్ జమ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. 2007 బ్యాచ్‌కు చెందిన ఈయన రాజమహేంద్రవరం ఐటీ కోర్ విభాగం నుంచి బదిలీపై మండపేటకు వచ్చారు. ఎస్ఈబీ సీఐగానూ, కృష్ణ, పశ్చిమ గోదావరి జిల్లాల్లో సీఐగా పనిచేశారు. బాధ్యతలు చేపట్టిన అనంతరం ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులును మర్యాదపూర్వకంగా కలిశారు. శాంతి భద్రతల పరిరక్షణకు కృషి చేస్తానని సీఐ అఖిల్ జమ అన్నారు.

ఘనంగా ఇందిరా జయంతి

కె.గంగవరం: మండలంలోని అముజూరులో ఆదివారం మాజీ ప్రధాని ఇందిరా గాంధీ జయంతిని కాంగ్రెస్ పార్టీ శ్రేణులు ఘనంగా నిర్వహించాయి. నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కోట శ్రీనివాసరావు అముజూరులోని ఇందిరా గాంధీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

వామ్మో.. చలి

- పడిపోతున్న రాత్రి ఉష్ణోగ్రతలు
- తెల్లవారుజామున పొగమంచుతో ఇబ్బందులు
- వణుకుతున్న చిన్నారులు, వృద్ధులు


కె.గంగవరంలో ఉదయం 7 గంటలైనా వదలని మంచు


చలిమంట కాగుతున్న దృశ్యం (ఫైల్)

కె.గంగవరం: నియోజకవర్గంపై చలి పంజా విసురుతోంది. ఇప్పటి వరకు వర్షాకాలం అయినా ఆశించినంతగా వర్షాలు పడకపోగా ఎండ తీవ్రత అధికంగా ఉంది. గత వారం రోజులుగా ప్రస్తుతం చలి తీవ్రత క్రమక్రమంగా పెరుగుతుంది. సాయంత్రం 7 గంటల నుంచే చలిగాలులు వీస్తుండడంతో జనం వణికిపోతున్నారు. రాత్రి 10.30 గంటల నుంచి ఉష్ణోగ్రతలు క్రమేపీ పడిపోవడంతో చలి తీవ్రత అంతకంతకు పెరిగిపోతోంది. అర్ధరాత్రి 2 గంటల నుంచి ఉదయం 6 గంటల వరకు మంచు కురుస్తూ విపరీతమైన చలి ఉండడంతో వాహనదారులు ప్రయాణం చేయలేక వణికిపోతున్నారు. తలకు టోపి, ముఖానికి మఫ్లర్‌తో పాటు శరీరానికి రక్షణగా స్వెటర్లు వేసుకుంటున్నప్పటికీ చలితీవ్రత నుంచి ఉపశమనం పొందలేకపోతున్నారు.

వణుకుతున్న చిన్నారులు.. వృద్ధులు

గడిచిన నాలుగు రోజులుగా రికార్డు స్థాయిలో 30 డిగ్రీల వరకు ఉష్ణోగ్రతలు నమోవుతున్నాయి. ఉదయం 7 గంటలు అయినా చలి బెంబేలెత్తిస్తుంది. దీంతో ప్రజలు ఉదయం లేవాలంటే భయభ్రాంతులకు గురవుతున్నారు. ఏటా డిసెంబర్ రెండో వారం నుంచి చలి తీవ్రత పెరుగుతుంది. కానీ ఈ సంవత్సరం నవంబర్ రెండో వారం నుంచే పెరిగిన చలితో వృద్ధులు, చిన్నారులు వణికిపోతున్నారు. శ్వాసకోశ, ఆస్తమా, ఊపిరితిత్తులు సంబంధిత రోగులు ఈ చలికి తీవ్ర స్థాయిలో ఇబ్బందులు పడుతున్నారు. గత ఏడాదిని ఈ చలికాలంలో నియోజకవర్గంలోని కె.గంగవరం, కాజులూరు, రామచంద్రపురం మండలాల్లో సుమారు 25 మంది వృద్ధులు చలితీవ్రతకు చనిపోయారు. ఈ చలికాలం కచ్చితంగా వైద్య సూచనలు, సలహాలు పాటించాలని డాక్టర్లు కోరుతున్నారు. కె.గంగవరం, కాజులూరు మండలంలోని గోదావరి పరీవాహక ప్రాంతా గ్రామాల్లో చలి తీవ్రత అధికంగా ఉంది. ప్రస్తుతం పొలం పనులు ముమ్మరంగా జరుగుతున్న తరుణంలో తెల్లవారుజామున పనులకు వెళ్లేందుకు కూలీలు ఇబ్బందులు పడుతున్నారు. చలితీవ్రత తట్టుకోలేక ఉదయం 7 దాటిన తరువాత కానీ పనులకు రావడం లేదని రైతులు వాపోతున్నారు.

చలి పెరిగింది

నాలుగు రోజుల నుంచి చలి తీవ్రత బాగా పెరిగింది. దీంతో చిన్నారులు, వృద్ధులు అడుగు బయటపెట్టాలంటేనే బయపడుతున్నారు. ప్రతి సంవత్సరం చలికాలం వచ్చిందంటే చాలు వృద్ధులు అనారోగ్యాలకు గురై చనిపోతారు. వారికి చలికాలం తీవ్రత బట్టి ఆరోగ్యంపై వైద్య సిబ్బంది అవగాహన కల్పించాల్సిన అవసరం ఉంది.

– వి.వెంకట్రావు, బాలాంత్రం

మందులు అందుబాటులో ఉంచాలి

చలికాలంలో ప్రభుత్వ ఆసుపత్రిలో మందులు పూర్తి స్థాయిలో అందుబాటులో ఉంచాలి. గత ప్రభుత్వ హయాంలో పీహెచ్‌సీల్లో మందులు అందుబాటులో లేక బయట కొనుగోలు చేసేవారు. ఈ సారి అలాంటి పరిస్థితి రాకుండా చలికాలంలో వచ్చే రోగాలకు సంబంధించి మందులు అందుబాటులో ఉంచాలి.

– కె.విజయదుర్గ, కోఆప్షన్ సభ్యులు, పేకేరు

గొల్లపాలెం వాటర్‌ట్యాంక్ వద్ద సందడి


గొల్లపాలెంలో వాటర్‌ట్యాంక్ వెనుక ఉన్న వనభోజనాల మామిడితోట


గుండారం వనభోజనాల మామిడితోటకు వెళ్లే మార్గానికి ముఖద్వారం

కాజులూరు: కార్తికమాసంలో కాజులూరు మండలం గొల్లపాలెం వాటర్‌ట్యాంక్ (భారీ రక్షిత మంచినీటి పథకం)కు వనభోనాల తాకిడి ఎక్కువగా ఉంటుంది. ఆహ్లాదకరమైన కుళాయిచెరువు, దానిని ఆనుకుని విశాలమైన మామిడితోట, తోటలో పచ్చికబయళ్లను తలపించే చదునైన స్థలం వనభోజనాలకు అనువుగా ఉండటంతో ఇటీవల ఇక్కడ కార్తికమాసం పురస్కరించుకుని ఆదివారం, సోమవారాల్లో వనభోజనాలు ఎక్కువగా జరుగుతున్నాయి. ఇక్కడ రద్దీ ఎక్కువైనప్పుడు సమీపంలోని గుండారం మామిడితోటల్లోనూ సందర్శకులు వనభోజనాలు చేస్తున్నారు. గొల్లపాలెం పరిసరాల్లో ఉన్న కాజులూరు, కరప మండల గ్రామాలతో పాటు రామచంద్రపురం, కాకినాడ పట్టణాల నుంచి సందర్శకులు ఇక్కడకు వచ్చి వన భోజనాలు చేస్తున్నారు. గత కొన్నాళ్లక్రితం స్థానికులు ఈ తోటల్లో ఉసిరిచెట్లు వేయడంతో పూజలు నిర్వహించుకునేందుకు భక్తులు అధికంగా వస్తున్నారు. కాకినాడ, కోటిపల్లి రహదారిని ఆనుకుని వాటర్‌ట్యాంక్ ఉండగా దాని వెనుక భాగంలో వన భోజనాల మామిడితోటలు ఉన్నాయి. కాకినాడ, రామచంద్రపురంల నుంచి 15 కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతానికి నిత్యం ఆటోలు, ఆర్టీసీ బస్సులు సదుపాయం ఉండటంతో రాకపోకలకు అనువుగా ఉందని సందర్శకులు చెబుతున్నారు.

రామచంద్రపురం డిపో నుంచి 2 పంచారామ దర్శిని బస్సులు


రామచంద్రపురం డిపో నుంచి పంచారామ దర్శిని బస్సులు ప్రారంభిస్తున్న డిపో మేనేజర్ వెంకటేశ్వర్లు

రామచంద్రపురం రూరల్: కార్తిక మాసంలో కార్తిక సోమవారం శివాలయాలను సందర్శించడం భక్తులు విశిష్టంగా భావిస్తారు. భక్తుల మనోభావాలకు అనుగుణంగా ఆర్టీసీ ఏటా కార్తిక మాసంలో ప్రతి సోమవారం ఒకే రోజులో పంచారామ క్షేత్రాలను సందర్శించుకునే విధంగా పంచారామ దర్శిని పేరుతో ప్రత్యేక సర్వీసులను నడుపుతోంది. దీనిలో భాగంగా కార్తిక మాసం మొదటి సోమవారం దర్శనాల నిమిత్తం ఆదివారం రామచంద్రపురం డిపో నుంచి 2 పంచారామ దర్శిని బస్సులు బయలుదేరాయి. పంచారామ క్షేత్రాలైన అమరావతి, భీమవరం, పాలకొల్లు, సామర్లకోట, ద్రాక్షారామ క్షేత్రాలను సందర్శించే విధంగా ఆర్టీసీ అధికారులు ఏర్పాట్లు చేశారు. రామచంద్రపురం డిపో మేనేజర్ కొడమంచిలి వెంకటేశ్వర్లు బస్సు యాత్రికులకు మంచి నీళ్లు, బిస్కట్ ప్యాకెట్ అందించి బస్సులను ప్రారంభించారు. కార్తిక మాసంలో ప్రతి ఆదివారం పంచారామ దర్శిని ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేసినట్లు డీఎం వెంకటేశ్వర్లు తెలిపారు. 39 మంది భక్తులు ఉంటే వారి ఊరి నుంచే బస్సు బయలుదేరేలా ఏర్పాటు చేశామన్నారు. భక్తులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

జ్యోతిష శాస్త్రంలో ఉచిత శిక్షణ


వెలంపాలెం వేద పాఠశాలలో జ్యోతిషంలో ఉచిత శిక్షణ ఇస్తున్న సంపత్‌కుమార్

రామచంద్రపురం రూరల్: మండలంలోని వెలంపాలెం చంద్రశేఖరేంద్ర సరస్వతీ స్వామి, చంద్రశేఖర భారతీ స్వామి స్మారక ట్రస్ట్ వేదపాఠశాలలో జ్యోతిష శాస్త్రంలో భాగమైన భృగు నంది నాడీ జ్యోతిషంపై ఆదివారం ఉచిత శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. కాకినాడకు చెందిన జ్యోతిష విద్వన్మణి బ్రహ్మశ్రీ మేడవరపు సంపత్‌కుమార్ నేతృత్వంలో రెండు సంవత్సరాల పాటు ప్రతి ఆదివారం సాయంత్రం 4 గంటలకు ఈ ఉచిత శిక్షణ కొనసాగుతుందని నిర్వాహకులు తెలిపారు. మరింత సమాచారం కోసం ఫోన్ నంబరు 99977 71957 పై సంప్రదించాలని కోరారు.

ఘనంగా శివస్వాముల రథోత్సవం


శివస్వాముల కళ్యాణోత్సవాల్లో భాగంగా ఉమాపార్వతీ సమేత రామలింగేశ్వరస్వామి

కాజులూరు: శివస్వాముల రథోత్సవం కాజులూరు, కరప, రామచంద్రపురం మండల గ్రామాల్లో ఆదివారం ఘనంగా సాగింది. కార్తిక మాసం పురస్కరించుకుని గత వారం పెద్దాపురప్పాడు శివాలయంలో మండల పరిసర గ్రామాలకు చెందిన 108 మంది భక్తులు శివ దీక్షలు చేపట్టారు. ఇందులో భాగంగా ఆదివారం స్వామి రథోత్సవం నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకుడు బాదంపూడి నాగవెంకటసుబ్రహ్మణ్యం (పండుస్వామి) ఆధ్వర్యంలో శివస్వాములకు తోడు సుమారు 500 మంది భక్తులు పాల్గొని గొల్లపాలెం ధనమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో పూజలు నిర్వహించి రథయాత్ర ప్రారంభించారు. అనంతరం మండలంలోని గొల్లపాలెం, ఆర్యావటం, జగన్నాథగిరి తదితర గ్రామాల మీదుగా స్వామివారి రథయాత్ర ద్రాక్షారామ చేరుకుంది. ద్రాక్షారామ భీమేశ్వరస్వామివారి ఆలయంలో శివస్వాములు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

భీమేశ్వరాలయానికి పోటెత్తిన భక్తులు


ద్రాక్షారామ భీమేశ్వరాలయంలో క్యూలో వేచియున్న భక్తులు

రామచంద్రపురం రూరల్: కార్తికమాసం కావడంతో ఆదివారం ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరాలయానికి భక్తులు పోటెత్తారు. భక్తుల రద్దీకి అనుగుణంగా ఆలయ ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో క్యూలైన్ బారికేడ్లు, మంచినీటి సదుపాయాలు, తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశారు. కార్తిక సోమవారాల్లో ఆలయాన్ని సుమారు లక్ష మంది వరకు దర్శించుకునేందుకు వస్తుంటారు. ఆలయ ప్రాంగణంలోని సప్త గోదావరిలో భక్తులు స్నానాలు ఆచరించేందుకు అనుగుణంగా గోదావరి నీటిని రిలయన్స్ కంపెనీ ఏర్పాటు చేసిన ప్రత్యేక పైపు లైన్ ద్వారా నింపారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, సినిమాటోగ్రఫీ, సమాచార పౌర సంబంధాల శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ ప్రత్యేక శ్రద్ధతో ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు. ఆలయం వద్ద, గ్రామంలోనూ ఎటువంటి ట్రాఫిక్ ఇబ్బందులు తలెత్తకుండా పోలీస్ అధికారులకు సూచనలు చేశారు.

కార్తిక వనభోజనాలు


కార్తిక వనభోజనాల సందర్భంగా ద్రాక్షారామలో కార్పెంటర్ యూనియన్ల నాయకులు


కార్తిక భోజనాల్లో పాల్గొన్న వివిధ సంఘాల నాయకులు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ భీమేశ్వర కార్పెంటర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఆదివారం గ్రామంలోని పైండా అగ్రికల్చరల్ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో కార్తిక వన భోజనాలు నిర్వహించారు. రామచంద్రపురం కామాక్షిదుర్గ యూనియన్, కె.గంగవరం ప్రసన్నాంజనేయ యూనియన్, కుయ్యేరు లక్ష్మీ గణపతి యూనియన్, తాళ్లరేవు శివగణేష్ యూనియన్‌ల సభ్యులు సుమారు 300 మంది కార్తిక వన భోజనాల్లో పాల్గొన్నారు. అనంతరం సంఘ పటిష్టత, కార్పెంటర్లు ఎదుర్కొంటున్న సమస్యలు తదితర అంశాలపై చర్చించుకున్నారు. ద్రాక్షారామ భీమేశ్వర కార్పెంటర్స్ యూనియన్ కార్యవర్గ సభ్యులు గాలి శ్రీరాము, కుడుపూడి పిల్లా రాయుడు, భరణికల సత్యనారాయణ, నిడదవోలు సత్యనారాయణ, టేకుమూడి శ్రీను, దొంగల మోషే, దాసరి సత్తిబాబులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

గ్రామాల్లో వన సమారాధనల సందడి

కపిలేశ్వరపురం: కార్తిక మాసం సందర్భంగా మండలంలోని పలు గ్రామాల్లో ఆదివారం వన భోజనాల సందడి నెలకొంది. ఆదివారం సెలవుదినం కావడంతో కేదారిలంక గ్రామ శివారు వీధివారిలంకలోని పర్యాటక, ఆధ్యాత్మిక కేంద్రమైన ధనమ్మ మర్రికి విద్యార్థులు, భక్తులు అధిక సంఖ్యలో తరలి వచ్చారు. కపిలేశ్వరపురం, కోరుమిల్లి, వాకతిప్ప గోదావరి తీర ప్రాంతాల్లో ఆటపాటలతో సందడిగా గడిపారు. కేశవరంలో రాజమహేంద్రి విద్యాసంస్థ సిబ్బంది, విద్యార్థులు ఏర్పాటు చేసిన వన సమారాధనలో ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


రాయవరం జెడ్పీ హైస్కూల్ 1998-99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు

రాయవరం: స్థానిక శ్రీరామయ్య జెడ్పీ ఉన్నత పాఠశాల 1998–99 బ్యాచ్ టెన్త్ విద్యార్థులు ఆదివారం ఆ పాఠశాల ఆవరణలో కలుసుకున్నారు. 23 ఏళ్ల అనంతరం పాఠశాల ఆవరణలో ఆ బ్యాచ్‌కు చెందిన 128 మంది పూర్వ విద్యార్థులు కుటుంబ సమేతంగా కలుసుకుని సందడి చేశారు. రాష్ట్రంలో వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనంలో గత స్మృతులను నెమరువేసుకున్నారు. తమ కలయికకు కారణమైన స్నేహితులను అభినందించారు. అనంతరం మిత్రులంతా కలసి గ్రూపు ఫొటో దిగారు. ఈ కలయికకు కాలా శివశంకరరావు, కర్రి సురేష్‌కుమార్‌రెడ్డి, కర్రి వీర్రాఘవరెడ్డి, ర్యాలి సత్తిబాబు, తాడి శ్రీనివాసరెడ్డి తదితర స్నేహితులు కృషి చేశారు.

కృత్తివెంటి గ్రౌండ్‌లో బిగ్ స్క్రీన్ ఏర్పాటు


గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్ ద్వారా మ్యాచ్‌ను చూస్తున్న మంత్రి వేణు, నరేన్


గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బిగ్ ఎల్ఈడీ స్క్రీన్

రామచంద్రపురం: ఇండియా–ఆస్ట్రేలియా వరల్డ్ క్రికెట్ కప్ ఫైనల్ మ్యాచ్ తిలకించేందుకు స్థానిక కృత్తివెంటి పేర్రాజు పంతులు క్రీడా ప్రాంగణంలో రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ తనయుడు నరేన్ యువసేన నేతృత్వంలో బిగ్ స్క్రీన్‌ను ఏర్పాటు చేశారు. అధిక సంఖ్యలో క్రీడాభిమానులు ప్రజలు వచ్చి మ్యాచ్‌ను తిలకించారు. మంత్రి వేణు మ్యాచ్ ప్రారంభంలో వచ్చి క్రీడాకారులతో కలసి కొద్ది సేపు మ్యాచ్‌ను చూశారు. గతంలో ఎన్నడూ లేని విధంగా గ్రౌండ్‌లో ఇలాంటి ఏర్పాట్లు చేయటంపై క్రీడాభిమానులు ఆనందం వ్యక్తం చేశారు. మ్యాచ్ ప్రారంభం నుంచి సాయంత్రం వరకు క్రీడాభిమానులు గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బిగ్ స్క్రీన్ ద్వారా మ్యాచ్‌ను చూసి ఆనందించారు.

పేదలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ


గొల్లపుంతలో భోజనం ప్యాకెట్లు అందజేస్తున్న నిర్వాహకులు

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట గొల్లపుంత కాలనీ 20వ వార్డులో శ్రీమోక్ష స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం పేదలకు భోజనం ప్యాకెట్లను పంపిణీ చేశారు. పట్టణ శెట్టిబలిజ సంఘం అధ్యక్షుడు పంపన శ్రీనివాస్ భోజనం ప్యాకెట్లును సమకూర్చినట్టు సంస్థ నిర్వాహకులు ఎగ్గాడి లోవరాజు, తాతపూడి సందీప్, సూరిబాబు, వెంకటరమణ, సతీష్ తెలిపారు. క్రమం తప్పకుండా సేవా కార్యక్రమాలను చేస్తున్న సంస్థ నిర్వాహకులు, దాతను 13వ సచివాలయం కన్వీనర్ గెద్దాడ సత్యనారాయణ తదితరులు అభినందించారు.

అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణానికి శ్రీకారం


విగ్రహ శంకుస్థాపనలో ఎమ్మెల్సీ తోట

కపిలేశ్వరపురం (మండపేట): మండపేట మండలం మెర్నిపాడు గ్రామంలో గారపాటి అశోక్ కుమార్ ఆధ్వర్యంలో చేపట్టిన అభయాంజనేయ స్వామి విగ్రహ నిర్మాణ పనులకు ఎమ్మెల్సీ తోట త్రిమూర్తులు ఆదివారం శంకుస్థాపన చేశారు. వెంపాటి సూరిబాబు, దంపతులు పీటలపై కూర్చుని పూజలు చేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ పిల్లా వీరబాబు, పిల్లా సురిబాబు, గ్రామ పెద్దలు ముత్యాల సత్యనారాయణ, మద్దిపూడి వెంకటరావు, వల్లూరి రాజు, బి.సుబ్బారావు, గుణ్ణం బొజ్జియ్య, కొయ్యల నాగేశ్వరరావు పాల్గొన్నారు.

పాణింగపల్లిలో..


విగ్రహ స్థాపనకు పూజలు చేస్తున్న దృశ్యం

కె.గంగవరం: మండలంలోని పాణింగపల్లిలో ఆదివారం దాతలు ఆంజనేయస్వామి విగ్రహం ఏర్పాటు చేయడానికి కొబ్బరికాయ కొట్టి శంకుస్థాపన చేశారు. గ్రామానికి చెందిన వైట్ల గాంధీ జ్ఞాపకార్థం వారి కుమారులు స్థానికంగా ఉన్న బీసీ కాలనీ వద్ద రామాలయం ఎదుట విగ్రహంతో పాటు మండప నిర్మాణానికి వేద పండితుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేసి శంకుస్థాపన చేశారు. ఈ పూజల్లో గ్రామస్తులు, కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. సర్పంచ్ చీకట్ల సునీత ఈ కార్యక్రమంలో పాల్గొని పూజలు చేశారు.

కపిలేశ్వరపురంలో ముగ్గుల పోటీలు


కపిలేశ్వరపురంలో ముగ్గులు అద్దుతున్న బాలికలు

కపిలేశ్వరపురం: జాతీయ గ్రంథాలయ వారోత్సవాల్లో భాగంగా స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ముగ్గుల పోటీలను నిర్వహించారు. గ్రంథాలయాధికారి దానేటి శివకుమారి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో తొలుత తొలి మహిళా ప్రధాని ఇందిరాగాంధీ చిత్రపటం వద్ద నివాళి అర్పించారు. జూనియర్స్, సీనియర్స్ విభాగాలుగా నిర్వహించిన పోటీలో 43 మంది బాలికలు రంగురంగుల ముగ్గులను తీర్చిదిద్దారు. ఈ నెల 20న నిర్వహించే వారోత్సవాల ముగింపు కార్యక్రమంలో విజేతలకు బహుమతులను అందజేయనున్నట్టు గ్రంథాలయాధికారి తెలిపారు.

గ్రంథాలయంలో మహిళా దినోత్సవం

రాయవరం: మండలంలోని మాచవరం శాఖా గ్రంథాలయంలో ఆదివారం మహిళా దినోత్సవాన్ని నిర్వహించారు. మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లైబ్రేరియన్ టి.ప్రమీల ఆధ్వర్యంలో ఇందిరాగాంధీ చిత్ర పటానికి నివాళులర్పించారు. సర్పంచ్ కత్తుల సీతామహాలక్ష్మి ఇందిరాగాంధీ చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో పాఠకులు పాల్గొన్నారు.

వసతులు మెరుగుపరచాలి

కాజులూరు: మండలంలోని ఆర్యావటం శివారు తుమ్మలపల్లిలంకలో వసతులు మెరుగుపరిచేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు. ఆదివారం గ్రామాలో బాధితులు పి.సుబ్రహ్మణ్యం, గీసాల రాజు తదితరులు విలేకరులతో మాట్లాడుతూ గ్రామంలో డ్రైనేజీల ఏర్పాటు, మంచినీటి సరఫరా, రహదారుల సదుపాయం లేకపోవటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. వర్షం వస్తే వీధులన్నీ జలమయం అవుతున్నాయన్నారు. అధికారులు స్పందించి ఈ శివారు గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.